నకిలీ వరి విత్తనాలపై నజర్ ఏది?

రామన్నగూడెంలో వరిపంటను పరిశీలిస్తున్న ఏడీఏ విజయచందర్

నిన్న రామన్నగూడెం.. నేడు నర్సింహులపేటలో.. రేపు ఎక్కడో?

నర్సింహులపేట, నవంబర్ 18: నకిలీ విత్తనాలపై వ్యవసాయ అధికారులు నజర్ వేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండల కేంద్రంలోని విత్తన దుకాణాల్లో జైశ్రీరాం వరి విత్తనం వేసిన రైతులు రోజుకో ఊరు చొప్పున నకిలీ విత్తనాల బాగోతం బయటకు వస్తున్నది. ఇంత జరుగుతున్నా సంబంధిత జిల్లా వ్యవసాయ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రామన్నగూడెంలో సుమారు 10 ఎకరాలు, నర్సింహులపేటలో 30 ఎకరాలతో పాటు పలు గ్రామాల్లోని తండాల్లో 100 ఎకరాల వరకు నకిలీ వరి విత్తనాలతో నష్టపోయినట్లు రైతులు చెబుతున్నారు. నర్సింహులపేటలోని రైతులు ఎండీ ఖాజామొయినొద్దీన్, చెన్నూరి నర్సింహారెడ్డి నాలుగు ఎకరాల్లో యశోద సీడ్స్ కంపెనీకి చెందిన జైశ్రీరాం వరి విత్తనంలో బెరుకులు రావడంతో అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై ఏవో వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. నకిలీ వరి పంటలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందించినట్లు తెలిపారు. రామన్నగూడెంలో ఏడీఏ విజయ చందర్ పరిశీలించారని, శాస్త్రవేతలు పరిశీలించిన అనంతరం ఇచ్చే నివేదిక ఆధారంగా రైతులకు న్యాయం చేసేలా సహకరిస్తామని పేర్కొన్నారు.

'బెస్ట్ అవైలబుల్ స్కీం' బకాయిలు విడుదల చేయాలి

కురవి: వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్/కురవి, నవంబర్ 18 : బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కువశాతం బెస్ట్ అవైలబుల్ స్కీం కింద దళిత విద్యార్థులు చదువుతున్నారని, వారికి రావాల్సిన ఫీజుల బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వెంకన్న, రామ్మూర్తి, సూర్యప్రకాశ్ జ్యోతిబసు పాల్గొన్నారు. అదేవిధంగా కురవి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ రవికుమార్‌కు ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు గంధసిరి జ్యోతిబసు, గిరిజన సంఘం ప్రతినిధి మాలోత్ కిషన్‌నాయక్‌వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్రంలో కార్పొరేట్, సోషల్ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ శాఖల సహకారంతో బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం ద్వారా 9వేల మంది దళిత పిల్లలు, 6వేల మంది గిరిజన చిన్నారులు చదువుకుంటున్నారని తెలిపారు. ప్రతి ఏటా ఫీజులు చెల్లించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం రూ. 175 కోట్లు చెల్లించకుండా విద్యార్థులపై వివక్ష చూపుతోందని ఆరోపించారు. ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం విద్యార్థులకు వసతి, భోజనాలు కూడా పెట్టడం లేదని, సీఎం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భాస్కర్, కొలిపాక వీరేందర్ నాయకులు పాల్గొన్నారు.

నెల్లికుదురులో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

తెగిన చెరువు కట్టలకు మరమ్మతులెప్పుడు..?

- మంత్రులొచ్చి వెళ్లారు.. చేసిందేమీలేదు
- సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా, వినతిపత్రం అందజేత

నెల్లికుదురు, నవంబర్ 18: ఇటీవల భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో తెగిన చెరువు కట్టలకు మరమ్మతులు ఇంకెప్పుడు చేస్తారు? నష్టం జరిగినప్పుడు మంత్రులు ఆదుకుంటామని మాట ఇంచారేతప్ప చేసింది శూన్యం' అని సీపీఐ జిల్లా కార్యదర్శి బీ విజయసారథి అన్నారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ నుంచి తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేసి తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు రావిరాల, ఆలేరు, రాజులకొత్తపల్లి గ్రామాల్లో చెరువు కట్టలు పూర్తిగా తెగిపోయాయని, మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి చెరువు కట్టలకు మరమ్మతులు చేసి పునర్నిర్మించాలని కోరారు. మత్స్యకారులను ఆదుకోవాలని, ఇళ్లు కూలిపోయిన వారికి నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బీ అజయ్‌సారథి, వరిపెల్లి వెంకన్న, బైస స్వామి, తుటి వెంకట్‌రెడ్డి, చిర్ర స్వతనా రాయణ తదితరులు పాల్గొన్నారు.

కాల్చితే నష్టం.. కలియదున్నితే లాభం

- జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల
- వరికొయ్యల కాల్చడంపై రైతులకు అవగాహన కార్యక్రమాలు

కురవి: రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏవో విజయనిర్మల

మహబూబాబాద్ రూరల్/ కురవి, నవంబర్ 18: వరి కొయ్యలను కాల్చడం వల్ల అనేక నష్టాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల అన్నారు. 'కాల్చడం ఆపేద్దాం.. భూసారాన్ని పరిరక్షించుకుందాం' అనే కార్యక్రమంలో భాగంగా సీరోలు మండలంలోని కాంపల్లి గ్రామంలో సోమవారం ఆమె పంట క్షేత్రాలను పరిశీలించారు. వరికొయ్యలను కాల్చిన పంటల యజమానులకు అవగాహన కల్పించారు. కాల్చడం వల్ల భూసారం దెబ్బతింటుందని, గడ్డి త్వరగా కుళ్లడానికి సూపర్‌ఫాస్ట్ వాడవచ్చన్నారు. వాతావరణంలో వస్తున్న పెనుమార్పులను గమనించి రైతాంగం వ్యవసాయ పద్ధతులను మార్చుకోవాలన్నారు. పంట అవశేషాలను కాల్చితే భూసారంతోపాటు, మానవాళికి ఊపిరితిత్తుల సమస్యలు ఎక్కువగా వస్తాయని, గాలి సైతం విపరీతంగా కలుషితం అవుతుందన్నారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ పంట అవశేషాలను కాల్చవద్దని సూచించారు. కార్యక్రమంలో డీహెచ్ఎస్‌వో మరియన్న, టెక్నికల్ ఏవోలు రాజు, మోహన్ పాల్గొన్నారు. మహబూబాబాద్ మండలంలోని పర్వతగిరి, రెడ్యాల, కంబాలపల్లి గ్రామాల రైతులకు డీఏవో విజయ నిర్మల అవగాహన కల్పించారు. వరికొయ్యలను కాల్చితే సాగులో ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు.

కాల్చితే అన్నివిధాల నష్టమే..

పెద్దవంగర/తొర్రూరు/ఇనుగుర్తి/నెల్లికుదురు : వరి కొయ్యలను కాల్చితే అన్నివిధాలా నష్టమేనని.. కలియదున్నితే లాభం వుంటుందని ఏవోలు స్వామి, భాస్కర్ అన్నారు. పెద్దవంగర, తొర్రూరు మండలాల్లోని చిట్యాల శివారులోని బావోజీతండా, వెలికట్టలోని రైతులకు వారు అవగాహన కల్పించారు. వానకాలం సీజన్ ముగిసిన నేపథ్యంలో వరి పంట కొయ్యలను కాల్చితే భూమిలోని పోషకాలు నశిస్తాయని, వాయు కాలుష్యం పెరుగుతుందన్నారు. పంటల్లో దిగుబడి తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు రాజు, వినయ్‌శర్మ, రైతులు పాల్గొన్నారు. అలాగే, రైతులు వరికొయ్యలను కాల్చవద్దని ఇనుగుర్తి మండల వ్యవసాయ అధికారి భూక్యా మహేందర్ అన్నారు. చిన్ననాగారంలో వరిపొలాలను ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. వరికొయ్యలను కాల్చడం వల్ల భూమిలోని నత్రజని, పాస్పరస్ పోషకాలు తగ్గి సూక్ష్మజీవులు నశిస్తాయని, తద్వారా పంట దిగుబడులు తగ్గిపోతాయని సూచించారు. అదేవిధంగా నెల్లికుదురు మండలంలోని ఎర్రబెల్లిగూడెంలో ఏవో ఎస్‌కే యాస్మిన్ పంటలను పరిశీలించి మాట్లాడారు. వరి కొయ్యలను కాల్చొద్దని, భూసారం దెబ్బతినడంతో పాటు పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

బయ్యారం: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

బయ్యారం, నవంబర్ 18: మండలంలోని కొత్తపేటలో రెండు ఐకేపీ, ఒక సొసైటీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించి మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను రైతులు దళారులకు అమ్మి మోస పో కుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. నిర్వాహకులు సకాలంలో కాంటాలు వేయాలని సూచించారు. అనంతరం పెద్దచెరువు కట్టపై కట్టమైసమ్మ విగ్రహం కింద గుప్త నిధుల కోసం తవ్విన ప్రాంతాన్ని పరిశీలించారు. సొసైటీ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి, ఏపీఎం నర్సింహ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే లక్ష్యం

పెద్దవంగర: రైతును రాజు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని పీఏసీఎస్ చైర్మన్ హరిప్రసాద్, ఏఎంసీ చైర్మన్ తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చెర్లపాలెంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. రైతన్నలు తమ గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలను అమ్ముకొని మద్దతు ధర పొందేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, కేంద్రాల్లో ఎలాంటి అక్రమాలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు త్వరగా కాంటాలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈవో మురళి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

దంతాలపల్లి, నవంబర్ 18: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రాష్ట్రాల సాంస్కృతిక పోటీల్లో మండలంలోని దాట్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు కావ్యశ్రీ, ఉషారాణి, శ్రావిక, నవ్యశ్రీ, కీర్తికిరణ్, పాల్ జోషఫ్, జాన్ జోషఫ్, స్టేవిన్, మానస, ఈక్షిత పాల్గొన్ని ప్రతిభ కనబర్చారు. సోమవారం విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసులు అరెస్ట్ చేసిన ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

అక్రమ అరెస్ట్‌లతో ఉద్యమాన్ని ఆపలేరు

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 18: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని కాంగ్రెస్ పార్టీ ఆపలేదని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లగచర్ల గిరిజనులకు మద్దతుగా సోమవారం 'చలో కొడంగల్'కు ఎల్‌హెచ్‌పీఎస్ పిలుపు ఇచ్చింది. దీంతో గిరిజన నాయకులు లగచర్లకు వెళ్లకుండా ప్రభుత్వం పక్కా ప్లాన్‌తో జిల్లాలోని నాయకులను పోలీసులతో ముందస్తు అరెస్ట్ చేయించడం సరికాదన్నారు. గిరిజనులను ఎన్ని ఇబ్బందులు పెట్టినా లగచర్ల భూములను మాత్రం ఫార్మా కంపెనీలకు ఇవ్వరన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి లంబాడాలను అణగ తొక్కాలని చూస్తున్నదని, సీఎం రేవంత్‌రెడ్డికి గిరిజనులు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. హరినాయక్, బోడ లక్ష్మణ్‌నాయక్, రాందాస్‌నాయక్, శివవర్మ, రమేశ్ పాల్గొన్నారు.

'వరంగల్‌కు వచ్చే నైతిక హక్కు రేవంత్‌రెడ్డికి లేదు'

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 18: సీఎం రేవంత్‌రెడ్డికి వరంగల్ వచ్చే నైతికహక్కు లేదని లంబాడా హక్కుల పోరాట సంఘం దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాందాసు, బాలునాయక్ అన్నారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజాపాలన పేరుతో గద్దె ఎక్కిన రేవంత్‌రెడ్డి ఏడాదిగా ఏ అభివృద్ధి పనులు చేయలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, పేదలు, గిరిజనులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, పరిష్కరించిన తర్వాత వరంగల్ పర్యాటనకు రావాలని డిమాండ్ చేశారు. శ్రీను, వెంకన్న, కస్కానాయక్ పాల్గొన్నారు.

అవయవ దానంతో ఐదుగురికి ప్రాణదానం

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 18: పట్టణంలోని ఎల్‌బీజీ నగర్‌కు చెందిన బొజ్జ వరుణ్ (23)మృతి చెందగా, అవయవాలు దానం చేయడంతో ఐదుగురికి ప్రాణదానం చేశారు. కాలనీకి చెందిన భిక్షపతి– మంగలమ్మ కుమారుడు వరుణ్ సూర్యాపేటలోని మోతే మండలంలో కోళ్లఫామ్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 6న మోతే మండలం కేశావపురం వెళ్తున్న ఆటో ఢీకొట్టగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సూర్యాపేట ఏరియా దవాఖానకు తరలించగా వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్ కామినేని దవాఖానలో చేర్చారు. 8న వరుణ్ బ్రెయిన్ డెడ్ కావడంతో డాక్టర్ల సూచన మేరకు కుటుంబ సభ్యులు అతడి రెండు కిడ్నీలు, రెండు కండ్లు, లివర్‌ను దానం చేశారు. అవి మరో ఐదుగురి ప్రాణాలను కాపాడాయి. అవయవదానంతో ఐదుగురి ప్రాణాలను కాపాడడంతో వరుణ్ కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు. వరుణ్ కుటుంబానికి ప్రభుత్వం తగిన సాయం అందించాలని స్థానికులు కోరారు.

మాతృ మరణాలను తగ్గించాలి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 18: మాతృ మరణాల సంఖ్యను తగ్గించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి మురళీధర్ అన్నారు. వివిధ పీహెచ్‌సీ డాక్టర్లతో సోమవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణులకు రక్తహీనత లేకుండా పౌష్టికాహారం అందించి, సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రమీల, సుధీర్‌రెడ్డి, సారంగం, రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌గా కృష్ణ

కేసముద్రం, నవంబర్ 18: రాష్ట్ర హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌గా మండల కేంద్రానికి చెందిన మారగాని కృష్ణను నియమిస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర నాయ్య సంబంధాల శాఖ కార్యదర్శి తిరుపతి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాదంగ్‌పేట, షాదనగర్ మున్సిపల్ కార్పొరేషన్లకు హైకోర్టు న్యాయవాదిగా ఆయన వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు. కృష్ణ నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

వేపచెట్ల ధ్వంసానికి కారణమైన వ్యక్తి అరెస్టు

కురవి, నవంబర్ 18: మల్యాల గ్రామంలోని జేవీఆర్ వ్యవసాయ పరిశోధన క్షేత్రంలో సుమారు 40 ఏండ్ల కాలంనాటి 12 వేప చెట్ల ధ్వంసానికి కారణమైన గ్రామానికి చెందిన గడ్డమీది వీరయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై గంధ్రాతి సతీశ్ తెలిపారు. 12 వేపచెట్లపై (తోడుక, పైబెరడు) సుమారు 4 అడుగుల మేర తొలగించి వాటి చావుకు కారణమైన వీరయ్యపై జేవీఆర్ పరిశోధన సంస్థ సైంటిస్ట్ అడ్లూరి ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందన్నారు.

పది ట్రాక్టర్ల ఇసుక డంప్ సీజ్

రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుక డంప్

నర్సింహులపేట, నవంబర్ 18: మండలంలోని కౌసల్యదేవిపల్లి, రామన్నగూడెం, బొడ్డితండా శివారు అకేరు వాగు నుంచి రాత్రి 7 నుంచి తెల్లవారుజామున 7 గంటల వరకు ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. దీంతో కొందరు అక్రమ ఇసుక వ్యాపారులు రాత్రి వెళ్లాలో ఇసుకను డంప్ చేసి పగలు వ్యాపారం చేస్తుండడంతో సోమవారం తహసీల్దార్ నాగరాజు ఆదేశాల మేరకు 10 ట్రాక్టర్ల ఇసుక డంప్‌లను పోలీస్, రెవెన్యూ సిబ్బంది సీజ్ చేశారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వరిపొలం దగ్ధం.. రూ.60వేల నష్టం

నెల్లికుదురు, నవంబర్ 18: చేతికందివచ్చిన వరి పొలం పూర్తిగా దగ్ధమైన ఘటన మండలంలో జరిగింది. రామన్నగూడేనికి చెందిన మల్యాల చంద్రయ్య ఎకరం పొలంలో వరి సాగు చేశాడు. చేతికందివచ్చిన పంటను వారం రోజుల్లో కోయడానికి సిద్ధంగా ఉన్నాడు. ఈ క్రమంలో సోమవారం ప్రమాదవశాత్తు పొలానికి నిప్పంటుకుని పూర్తిగా దగ్ధమైంది. దీంతో సుమారుగా రూ. 60వేల నష్టం జరిగినట్లు బాధితుడు చంద్రయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

గెజిటెడ్ హెచ్ఎంల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా లచ్చిరాంనాయక్

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 18: తెలంగాణ స్టేట్ గెజిటెడ్ హెడ్మాస్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఇస్లావత్ లచ్చిరాంనాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. సోమవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు చంద్రప్రకాశ్ ఆధ్వర్యంలో హెచ్ఎంలు అతన్ని ఎన్నుకున్నారు. నాలుగోసారి లచ్చిరాం ఎన్నికవడంతో ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చిన్నగూడూరు, నవంబర్ 18: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ నిరుపేదలకు ఆమడదూరంలో ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తిగా అమలు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు బండపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం గుండంరాజుపల్లిలో కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. వ్యవసాయ కార్మికులకు సమగ్రచట్టం అమలు చేయాలని, కూలీలకు రూ.12వేల జీవనభృతి ఇవ్వాలన్నారు. ఈ నెల 20 నుంచి డిసెంబర్ 2 వరకు సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, మహేందర్, వెంకటేశ్వర్లు, లింగయ్య, నారాయణ, జానీ, వెంకటయ్య ఉన్నారు.

'జూనియర్ సివిల్ జడ్జిని బదిలీ చేయాలి'

మహబూబాబాబాద్ రూరల్, నవంబర్ 18: తొర్రూరు కోర్టు జూనియర్ సివిల్‌జడ్జిని వెంటనే బదిలీ చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కీసర పద్మాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కోర్టు ఎదుట న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా జూనియర్ సివిల్ జడ్జి న్యాయవాదులపై దురుసుగా, బెంచ్‌కు, బార్ అసోసియేషన్‌కు అనేక సమస్యలు తీసుకురావడం వల్ల హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు చేయడంతో ఇంకా కఠినంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. బార్ అసోసియేషన్‌ను ఏమాత్రం పట్టించుకోవడం లేదని, జూనియర్ సివిల్ జడ్జిని బదిలీ చేయాలని పలువురు న్యాయవాదులు ఫిర్యాదు చేశారన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఉప్పలయ్య, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణ, దాసరి నాగేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సురేశ్ మృతిపై న్యాయ విచారణ జరిపించాలి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 18: ప్రభుత్వ జనరల్ దవాఖానలో సెక్యూరిటీగార్డ్‌గా పనిచేస్తున్న కుక్కమూడి సురేశ్ మృతిపై వెంటనే న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా కేసముద్రం మండల సంయుక్త కార్యదర్శి పైండ్ల యాకయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఈదులపూసపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సురేశ్ ఆత్మహత్యపై చాలా అనుమానాలు ఉన్నాయని, మృతుడి సెల్‌ఫోన్ కాల్‌డేటా ఆధారంగా పూర్తి విచారణ చేయాలన్నారు. ఇటీవల దవాఖానలో సెక్యూరిటీ మేనేజర్ కొత్తగా 10 మందికి ఉద్యోగాలు ఇచ్చాడని, సురేశ్‌ను మధ్యవర్తిగా పెట్టి ఇతర వ్యక్తులు డబ్బులు వసూలు చేశారని, దీంతో అతడిపై ఒత్తిడి చేయడం వల్లే ఆత్మహత్య చేసుకొని ఉంటాడన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేస్తే వాస్తవాలు బయటకు వస్తాయని, ఎస్సీ స్పందించి విచారణ చేయాలన్నారు. సమావేశంలో రంగయ్య, శంకరయ్య, రమేశ్ పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే నేషనల్ అవార్డుకు రాజేందర్ ఎంపిక

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 18: మహాత్మా జ్యోతిరావు పూలే –2024 నేషనల్ అవార్డుకు బీసీ రాజ్యాధికార సమితి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్‌గౌడ్ ఎంపికయ్యాడు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్తున్న వారికి ప్రతి ఏడాది అవార్డు అందజేస్తున్నారు. డిసెంబర్ 15న ఢిల్లీలో బహుజన సాహిత్య అకాడమీ వారు అందించనున్నారు. ఈ అవార్డుకు 27 రాష్ట్రాల నుంచి సుమారు 1000 మంది డెలిగేట్స్ పాల్గొంటారని, సోమవారం హైదరాబాద్‌లో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ఆహ్వాన పత్రాన్ని అందించినట్లు తెలిపారు.

ఆహ్వానపత్రం అందుకుంటున్న రాజేందర్‌గౌడ్

వ్యాపారులు నిబంధనలు పాటించాలి

తొర్రూరు, నవంబర్ 18: వ్యాపారులు నిబంధనలు పాటించాలని, డ్రైనేజ్ స్థలాలను దాటి ఆగ్రమించొద్దని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రోడ్డుకు ఇరువైపులా నిర్మిస్తున్న డ్రైనేజ్ దాటి రోడ్డుపైకి వస్తున్నారని, అలాంటి వారిపై మున్సిపల్ చట్టం–2019 ప్రకారం నోటీసులు ఇవ్వకుండానే తొలగిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ నూతనంగా నిర్మించిన కాల్వ దాటి ముందుకు రావద్దని, మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలన్నారు.

ఆర్థిక సాయం

నెల్లికుదురు, నవంబర్ 18: కిడ్నీ సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ పెరుమాండ్ల చంద్రమౌలిని కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసం రంజిత్ రెడ్డి సోమవారం పరామర్శించారు. రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.

ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 18: గ్రూప్–3 పరీక్షలు జిల్లా కేంద్రంలోని 21 సెంటర్లలో సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ప్రభుత్వ బాలికల, ఏకశిలా పాఠశాలల్లోని కేంద్రాలను పరీక్షల నోడల్ అధికారులు పరిశీలించారు. రెండోరోజు పేపర్–3కి మొత్తం 7,592 మంది అభ్యర్థులకు 4,321 మంది హాజరవగా, 3,271 మంది గైర్హాజరు అయినట్లు పరీక్షల రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ బలరాంనాయక్ తెలిపారు.

తొర్రూరు: డివిజన్ పరిధిలోని పరీక్ష కేంద్రాలను ఆర్డీవో గణేశ్, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్, తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్ తనిఖీ చేశారు. చీఫ్ సూపరింటెండెంట్లు ప్రతి సెంటర్‌ను విజిట్ చేసి సీసీ కెమెరాలు, అవసరమైన సౌకర్యాలు కల్పించారు.

దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడిగా శంకర్

కురవి, నవంబర్ 18: దివ్యాంగుల సమితి కురవి మండల అధ్యక్షుడిగా టేకులతండాకు చెందిన ధరంసోత్ శంకర్‌ను నియమిస్తూ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర్ల ఉపేందర్ గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం శంకర్‌కు నియామక పత్రం అందజేశారు. ఉపేందర్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.6వేల పెన్షన్‌ను వెంటనే ఇవ్వాలన్నారు. ప్రత్యేక రుణాలు అందించి వారికి ఆర్థిక చే యుత అందించాలన్నారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మున్నా, రాష్ట్ర అధ్యక్షుడు నయీం, ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులకు శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

తొర్రూరు: గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న డాక్టర్ సుగుణాకర్, లయన్స్ ప్రతినిధులు

తొర్రూరు/మహబూబాబాద్ రూరల్, నవంబర్ 18: గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని తొర్రూరు ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ పీ సుగుణాకర్‌రాజు అన్నారు. లయన్స్ క్లబ